# సాక్షి అనంతపురం

గురువారం । 9 । నవంబర్ । 2023






**టన్ను చీనీ రూ.30 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు ధర పలికాయి.



**కిలో టమాట రూ.23**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టం రూ.9, సరాసరి రూ.16 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
35.6°/21.8°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

# ఆయుష్ ప్రదాత ఆరోగ్యశ్రీ

- పేదల ఆరోగ్యానికి భరోసా
- పెద్ద జబ్బులకు ఉచితంగా ఖరీదైన వైద్యం
- ఉమ్మడి జిల్లాలో 3.73 లక్షల మందికి వైద్య సేవలు
- ఆరోగ్యశ్రీ చికిత్సల తర్వాత.. ఆసరా ద్వారా ఆర్థిక తోడ్పాటు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆరోగ్యశ్రీ..ఈ పేరు చెప్పగానే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకొస్తారు. ఆయన ప్రవేశపెట్టిన ఈ పథకం ఇప్పుడు పేదలకు అపర సంజీవనిగా, ఆయుష్‌ప్రదాతగా విరాజిల్లుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు అంటే 2019 నాటికి పథకం కొడిగట్టిన దీపంలా ఉండేది. అలాంటి ఈ పథకానికి మళ్లీ ప్రాణం పోయడంతో లక్షలాది మందికి ఇంటి దీపమైంది. అనంతపురం జిల్లా అంటేనే వ్యవసాయ ఆధారిత జిల్లా. ఇంటి యజమానికి జబ్బు చేస్తే వైద్యం చేయించలేని స్థితిలో పేద కుటుంబాలు ఉన్నాయి. అలాంటి కుటుంబాలకు పెద్దదిక్కుగా భరోసా ఇస్తోంది ఆరోగ్యశ్రీ పథకం.

**నాలుగున్నరేళ్లలో 3.73 లక్షల మందికి..**

పేదలకు ఇంతగా ఉపయోగపడిన పథకం మరొకటి ఉండదేమో అనిపిస్తోంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో జగనన్న ప్రభుత్వం వచ్చాక నాలుగున్నరేళ్లలో అక్షరాలా 3.73 లక్షల మందికి పైగా ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలందాయి. క్యాన్సర్ మొదలుకొని గుండెజబ్బుల వరకూ ఉచితంగా వైద్యమందించి ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపింది. అనంతపురం జిల్లాలో 2.25 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో 1.48 లక్షల మంది ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకున్నారు. అంతేకాదు చికిత్స అనంతరం కోలుకునే సమయంలో ఆరోగ్య ఆసరా పేరుతో డబ్బు ఇస్తున్నారు. ఆసరా కింద గడిచిన నాలుగున్నరేళ్లలో అనంతపురం జిల్లాలో రూ.52.62 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.38.70 కోట్లు ఖర్చు చేశారు.

**3,400 చికిత్సలతో వైద్యం**

2019 మే 30న వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టేనాటికి 1,058 చికిత్సలతో ఆరోగ్యశ్రీ ఉండేది. అదికూడా అరకొర వైద్యం. నెట్‌వర్క్ ఆస్పత్రులకు డబ్బులివ్వకపోవడంతో రోగులకు వైద్యం చేయకుండా తిరస్కరించేవారు. పెద్ద జబ్బులకు ఇతర రాష్ట్రాలకు వెళితే ఆరోగ్యశ్రీ వర్తించేది కాదు. ఇలాంటి పథకాన్ని పునరుద్ధరించి చికిత్సల సంఖ్యను 3,400కు పెంచారు. క్యాన్సర్, గుండె జబ్బులకు ఇతర రాష్ట్రాల్లోనూ చికిత్స చేసేలా అనుమతిచ్చారు. జబ్బుకు చికిత్స చేసుకుని కోలుకునే వరకూ ఆరోగ్య ఆసరా కింద డబ్బులిస్తున్నారు. దీంతో రోగికి ఎంత పెద్ద జబ్బు చేసినా పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే భరిస్తోంది. దీంతో పేదవారిలో రోగమొస్తే ఆరోగ్యశ్రీ ఉందనే భరోసా వచ్చింది.

**అనంతపురం జిల్లాలో ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా లబ్ధి వివరాలు**

| సంవత్సరం | కేసుల సంఖ్య | వ్యయం (రూ.కోట్లలో) | ఆరోగ్య ఆసరా | వెచ్చించిన వ్యయం (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|
| 2019-20 | 21,800 | 56.5 | 5,036 | 3.22 |
| 2020-21 | 32,970 | 70.75 | 13,741 | 8.06 |
| 2021-22 | 47,006 | 96.72 | 25,094 | 12.75 |
| 2022-23 | 65,459 | 144.7 | 35,060 | 17.27 |
| 2023-24 | 58,181 | 117.3 | 23,530 | 11.32 |
| మొత్తం | 2,25,416 | 485.97 | 1,02,461 | 52.62 |

**శ్రీ సత్యసాయి జిల్లాలో ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా లబ్ధి వివరాలు**

| సంవత్సరం | కేసుల సంఖ్య | వ్యయం (రూ.కోట్లలో) | ఆరోగ్య ఆసరా | వెచ్చించిన వ్యయం (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|
| 2019-20 | 14,728 | 36.6 | 3,684 | 2.44 |
| 2020-21 | 26,822 | 55.04 | 12,367 | 7.29 |
| 2021-22 | 41,321 | 79.43 | 23,558 | 11.53 |
| 2022-23 | 49,399 | 102.19 | 29,156 | 13.99 |
| 2023-24 | 16,049 | 31.1 | 6,939 | 3.45 |
| మొత్తం | 1,48,319 | 304.36 | 75,704 | 38.70 |

**ఆరోగ్య శ్రీ లేకపోతే గుండె ఆగిపోయేది**



నాకు 54 ఏళ్లు. ఏప్రిల్ 4వ తేదీ ఛాతినొప్పి వచ్చింది. అనంతపురం లోని పావని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాను. బైపాస్ సర్జరీ చేయాలని చెప్పారు. అక్కడి నుండి కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులోని పీపుల్స్ ట్రీ ఆసుపత్రికి తరలించారు. 10వ తేదీ ఆపరేషన్ చేశారు. సుమారు రూ.2 లక్షల వరకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్యం అందింది. ఇటీవల పరీక్షలకు వెళ్ళగా మరోసారి రూ.12,500 ఆరోగ్యశ్రీద్వారా ఆసుపత్రికి చెల్లించినట్లు ఆసుపత్రి వారు చెప్పారు. ఆరోగ్య శ్రీ ద్వారా మళ్ళీ బతికాను.

–గుడిపాటి హనుమంతు, కళ్యాణదుర్గం

**'ఆరోగ్యశ్రీ'తోనే బతుకుతున్నా**



మాది నిరుపేద కుటుంబం. నాకు 10 నెలల క్రితం తీవ్ర జ్వరం వచ్చింది. రక్త పరీక్షలు నిర్వ హించిన వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడ కిడ్నీ దెబ్బ తిందని వైద్యులు నిర్ధరించారు. డయాలసిస్ కోసం చాలా ఖర్చు చేశాం. ఆ తర్వాత ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా డయాలసిస్ సేవలు అందుతున్నాయి. వారానికి మూడుసార్లు అనంతపురంలోని సవీర ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నా. ఆరోగ్యశ్రీ ఉండబట్టే ఇంకా బతికి ఉన్నా. పెన్షన్ కూడా తీసుకుంటున్నా. –ఇమ్రాన్, రాయదుర్గం

**పునర్జన్మ పొందాను**



నేను ఆరు నెలలుగా తీవ్ర అనారోగ్యంతో ఉన్నాను. ఆస్పత్రికి వెళ్లి డాక్టర్లను కలిస్తే పరీక్షలు చేసి కిడ్నీ సమస్య ఉందన్నారు. ఆపరేషన్ చేస్తే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. వెంటనే అనంతపురంలోని సవీర ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కింద పైసా ఖర్చు లేకుండా సర్జరీ చేయించుకున్నాను. వారం రోజుల చికిత్స తర్వాత డిశ్చార్జి చేసి.. ఖర్చుల కోసమని రూ.5 వేలు ఇచ్చారు. ప్రస్తుతం నా ఆరోగ్యం చాలా బాగుంది.

– అల్లే అశ్విని, శివంపల్లి, తాడిమర్రి

## న్యూస్‌రీల్

**ప్రత్యామ్నాయ పంటల పరిశీలన**



ఆముదం పంటలను పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కంబదూరు: వేరుశనగకు ప్రత్యామ్నాయంగా సాగు చేసిన ఆముదం, మొక్కజొన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. బుధవారం మండలంలోని గొల్లపల్లి,అండేపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించి పంట దిగుబడుల గురించి రైతులతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులతో ఎంత మేరకు దిగుబడి దగ్గిందన్న విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో కేంద్రం నుంచి కరువు బృందం సభ్యులు రానుండడంతో కేంద్ర బృందం సభ్యులకు చూపించాల్సిన పంటలపై కూడా సంబంధిత వ్యవసాయాధికారులు, రైతులతో చర్చించారు. ఏడీఏ యల్లప్ప, వ్యవసాయాధికారి,ఏఓ జాఫర్ ఉన్నారు.

**ఆరోగ్య సేవలు అద్భుతం**



అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా చెంతకే ఆరోగ్య సేవలు తీసుకురావడం అద్భుతమని ప్రజలు పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని మూడు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి తెలిపారు. 1,350 మంది ఓపీ వైద్య సేవలు పొందారన్నారు. ఇందులో వైఎస్సార్ కంటి వెలుగు కింద 271 మంది సేవలు పొందారని తెలిపారు.

**రాయదుర్గం మీదుగా మూడు ప్రత్యేక రైళ్లు**



రాయదుర్గంటౌన్: దీపావళి, చాత్ పర్వదినాలను పురస్కరించుకుని నైరుతి రైల్వే రాయదుర్గం మీదుగా మూడు ప్రత్యేక రైళ్లు (మూడు ట్రిప్పులు) నడుపుతోంది. బెంగళూరులోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్టేషన్ నుంచి రాజస్థాన్‌లోని భగత్‌కి కోటి వరకు (06217/06218) ప్రత్యేక రైళ్ల రాకపోకలు ఉంటాయి. ఈ నెల 9, 16, 23 తేదీల్లో ప్రతి గురువారం బెంగళూరు నుంచి బయల్దేరే రైళ్లు శనివారం భగత్‌కి కోటి స్టేషన్‌కు చేరుకుంటాయి. అలాగే ఈ నెల 12, 19, 26 తేదీల్లో ప్రతి ఆదివారం భగత్‌కి కోటిలో బయల్దేరి మంగళవారం బెంగళూరులోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్టేషన్‌కు చేరుకుంటాయి. ఈ ప్రత్యేక రైళ్లు బెంగళూరు నుంచి చిత్రదుర్గం, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హోసపేట, హుబ్లీ, మీరజ్, పూణె, కళ్యాణ్, వడోదర, అహ్మదాబాద్, లూని మీదుగా భగత్‌కి కోటికి చేరుకుంటాయని నైరుతి రైల్వే అధికారులు తెలిపారు.

**క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి**



బ్యాటింగ్ చేస్తున్న వీసీ రంగజనార్దన, కీపింగ్ చేస్తున్న రిజిస్ట్రార్ సి.శశిధర్

అనంతపురం: సాంకేతిక విద్యలో రాణిస్తూనే క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింకా రంగజనార్దన పిలుపునిచ్చారు. నగరంలోని ఓటీపీఆర్ఐలో బుధవారం ఇంట్రా–కాలేజ్ స్పోర్ట్స్ మీట్–2కె23 అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్య అతిథి వీసీ జింకా రంగజనార్దన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని రీతిలో క్రీడోత్సవాలను నిర్వహిస్తున్న డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్ కృషి ప్రశంసనీయమన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకునే గుణం క్రీడలతో అలవడుతుందన్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, ఓటీపీఆర్ఐ డైరెక్టర్, పాలకమండలి సభ్యుడు బి.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ చక్కా గోపీనాథ్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి స్వరూపరాణి, పాలకమండలి సభ్యుడు ఎం.రామశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యాసంస్థల బంద్ విజయవంతం**



అనంతపురంలో బంద్‌లో పాల్గొన్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలని విశాఖపట్నంలో చేస్తున్న నిరాహార దీక్షలు వెయ్యి రోజులకు చేరుకున్న సందర్భంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్ జిల్లాలో విజయవంతమైంది. అనంతపురంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు వెళ్లి ప్రభుత్వ విద్యాసంస్థలను బంద్ చేయించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు ప్రైవేటు కరణ ఆపాలని డిమాండ్ చేశారు. రాయలసీమలోని కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర, ఏఐఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అలాం, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, పీడీఎస్ఓ జిల్లా కన్వీనర్ అశోక్, జనసేన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సిద్దు, ఓసి విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు జంప్‌రోప్ జిల్లా జట్టు ఎంపిక**

నల్లమాడ: జంప్‌రోప్ అండర్–17 ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు ఎంపిక పోటీలు గురువారం స్థానిక ఎస్టీ ఆశ్రమ పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జంప్‌రోప్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహనాయక్, కోచ్ హనీఫ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 10, 11 తేదీల్లో కర్నూలు జిల్లా మిడతూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు ఆధార్, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. వివరాలకు 9959847070, 6302188501 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## పిడుగుపాటుకు ఇద్దరి దుర్మరణం



మృతులు కాలూరాం,గంగాద్రి

కళ్యాణదుర్గం/బెళుగుప్ప/కొత్తచెరువు: ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు ఇద్దరు దుర్మరణం చెందారు. మహారాష్ట్రకు చెందిన కాలూరాం (45), వనిత దంపతులు తమ ముగ్గురు కుమార్తెలు, కుమారుడితో కలసి కొంత కాలం క్రితం బెళుగుప్ప మండలం బ్రాహ్మణపల్లికి వలస వచ్చారు. గ్రామ చెరువు వద్ద బొగ్గులు కాలుస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో చెరువు వద్ద చిన్నపాటి టెంటు వేసుకుని నివాసముంటున్నారు. బుధవారం సాయంత్రం గుడిసెపై పిడుగు పడింది. లోపల ఉన్న కాలూరాం (40) అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న వనిత షాక్‌కు గురైంది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై బెళుగుప్ప పోలీసులు కేసు నమోదు చేశారు.

- కొత్తచెరువు మండలం పాత దేవరపల్లికి చెందిన గంగాద్రి (26) బుధవారం సాయంత్రం పొలంలో వ్యవసాయ పనులు చూసుకుని ఇంటికి వచ్చాడు. తిరిగి గొర్రెల మంద దగ్గరకు సాయంత్రం బయలుదేరి వెళుతుండగా గ్రామ సమీపంలో ఉన్నపళంగా పిడుగు పడడంతో గంగాద్రి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమీపంలోని రైతుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన గంగాద్రిని పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కొంతసేపటి తర్వాత గంగాద్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

నార్పల: అధికారులు నిర్లక్ష్యం వీడి మండల స్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. బుధవారం నార్పల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 59 అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అనంతరం స్థానిక పశువైద్యశాలను తనిఖీ చేశారు. పశువైద్యశాల సక్రమంగా లేకపోవడంతో పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని వాడుకోవాలని ఏడీ రత్నకుమార్‌కు సూచించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సర్పంచు మన్నీల సుప్రియ పలు ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్ కుమార్‌రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీఎస్ఓ శోభారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్‌బాషా, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, హార్టికల్చర్ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, డీఈఓ నాగరాజు, డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

**చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం**

శింగనమల: నార్పల మండల కేంద్రానికి చెందిన బుద్ధిమాంద్య చిన్నారి అశోక్ చక్రవర్తికి మెరుగైన వైద్యం చేయించేందుకు లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత జూలైలో కళ్యాణదుర్గం వచ్చినపుడు నార్పలకు చెందిన ఆటో డ్రైవర్ నగేష్, పెద్దక్క దంపతులు తమ కుమారుడు అశోక్ చక్రవర్తి ఆరోగ్య పరిస్థితి గురించి వివరించి, ఆర్థికసాయం కోరారు. సీఎం ఆదేశాల మేరకు రూ.85వేలతో పాటు కిమ్స్ సవీర ఆస్పత్రి వారు సీఎస్ఆర్ కింద అందించిన రూ.15వేలు కలిపి మొత్తం రూ.లక్ష ఆర్థికసాయాన్ని నార్పలలో జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్ అందజేశారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ గౌతమి

**విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ట్యాబ్‌లు**

అనంతపురం: నగర శివారులోని పంగల్‌రోడ్డు వద్ద ఉన్న ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ పాఠశాలలోని విభిన్న ప్రతిభావంతులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక ట్యాబ్‌లను కలెక్టర్ గౌతమి బుధవారం అందజేశారు.

## సుపరిపాలనను వివరిస్తాం

- 'వై ఏపీ నీడ్స్ జగన్' జయప్రదం చేయాలని విప్ కాపు పిలుపు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారు. జగనన్న ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని, సస్య శ్యామలం అవుతుందని ప్రజలందరూ భావిస్తున్నారు. రాష్ట్రానికి జగన్ ఆవశ్యకత గురించి తెలియజేసేందుకు గురువారం నుంచి చేపడుతున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి విప్ విలేకరుల సమావేశం నిర్వహించారు. విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే 'గడప గడపకూ మన ప్రభుత్వం', జగనన్న సురక్ష, మా నమ్మకం నువ్వే జగన్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకమయ్యామన్నారు. తాజాగా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు పాల్గొనాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో 'సంక్షేమం – అభివృద్ధి' బోర్డును ఏర్పాటు చేసి సీఎం జగన్ విప్లవాత్మక పాలనను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. ముఖ్యంగా నవరత్నాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.2,40,000 కోట్లు జమ అయ్యిందన్నారు.

**ఇసుక దోపిడీ కేసులో కాలవ శ్రీనివాసులు పేరు చేర్చాలి**

టీడీపీ హయాంలో జరిగిన ఇసుక దోపిడీ కేసులో చంద్రబాబుతో పాటు అప్పటి మంత్రి, ఎమ్మెల్యేలను ముద్దాయిలుగా చేర్చారని, ఆ జాబితాలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేరును కూడా చేర్చాలని సీఐడీ చీఫ్‌కు విప్ కాపు రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉన్నపుడు రోజూ రూ.1.5 కోట్లు విలువ చేసే ఇసుక తోడేశారన్నారు. మాజీ సీఎం చంద్రబాబు 17 కేసుల్లో స్టే తెచ్చుకోవడంపై విచారణ చేపట్టాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి పది వేల పోస్టుకార్డులు రాసి పంపే కార్యక్రమం చేపడుతున్నట్లు కాపు తెలిపారు. స్టేలు తీసుకున్న కేసుల్లో ఏరోజూ కోర్టుకు హాజరు కానందున చంద్రబాబుపై స్టేలు ఎత్తివేయాలని బొమ్మనహాళ్ మండల ప్రజలు సుప్రీం కోర్టు న్యాయమూర్తికి వినతిపత్రం పంపారన్నారు.

**చంద్రబాబు దుర్మార్గాన్ని వివరిస్తాం**

గత టీడీపీ హయాంలో చంద్రబాబు చేసిన దుర్మార్గాన్ని ప్రజలకు వివరిస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు రైతులు, మహిళలను నట్టేట ముంచారన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మాట తప్పారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్ మహిళలను లక్షాధికారులను చేసేలా వివిధ కార్యక్రమాలను చేపట్టడంతో పాటు డ్వాక్రా రుణాలను మాఫీ చేశారన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేసి చూపారన్నారు. రైతు భరోసా, వ్యవసాయ విద్యుత్ బకాయిలు, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాల సున్నా వడ్డీ పథకం తదితర వాటికి రూ.లక్షా 75వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. విద్య, వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి నాడు–నేడు కార్యక్రమాలతో పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చేశారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం కోసం ఆస్పత్రులను బలోపేతం చేయడంతో పాటు నూతనంగా 16 వైద్య కళాశాలలను తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నారన్నారు.

**జగన్‌ది ప్రజారంజక పాలన**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయే విధంగా ప్రజారంజక పాలన సాగించారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. విద్య, వైద్య, పారిశ్రామిక, వ్యవసాయ తదితర రంగాల్లో నూతన సంస్కరణలను తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్‌ను ఉన్నత స్థాయికి చేర్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ప్రభుత్వం చేసిన మేలును వివరించి పాజిటివ్ దృక్పథంతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేల పర్యవేక్షణలో జరిగే 'వై ఏపీ నీడ్స్ జగన్' బృహత్తర కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ మాట్లాడారు.

**నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'**

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో జిల్లాలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర అన్ని వర్గాలభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అధిష్టానం శ్రీకారం చుట్టింది. గురువారం నుంచి జిల్లాలోని వివిధ సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరగనుంది. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే పర్యవేక్షణలో పార్టీ మండలాధ్యక్షులు ఓ సచివాలయానికి వెళ్లి సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డు ఆవిష్కరించనున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ మద్దతుదారుల సమక్షంలో మండలాధ్యక్షులు వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించనున్నారు. పార్టీ మండలాధ్యక్షులు సచివాలయ పరిధిలోని గ్రామ, పట్టణ పెద్దలతో కలిసి రాత్రి భోజనం చేయనున్నారు. అదే రోజు రాత్రి ఒక పార్టీ మద్దతుదారు ఇంట్లో బస చేస్తారు. శుక్రవారం ఆ సచివాలయ పరిధిలోని పది ఇళ్లను తప్పకుండా సందర్శించి గత టీడీపీ ప్రభుత్వం, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించనున్నారు.

**ప్రతి క్లెయిమ్‌నూ విచారణ చేయాలి**

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ –2024లో భాగంగా అందిన ప్రతి క్లెయిమ్‌తో పాటు రాజకీయపార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను తప్పనిసరిగా విచారణ చేయాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. ముఖ్యంగా తొలగింపు, షిఫ్టింగ్ ఓట్లపై వచ్చిన క్లెయిమ్‌లను ఈఆర్‌ఓలు కచ్చితంగా పరిశీలన చేయాలని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఇతర అంశాలపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల డీటీలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల డెలిషన్, షిఫ్టింగ్ కేసులకు సంబంధించి తొలగింపులపై ఈఆర్‌ఓలు విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈఆర్‌ఓ లాగిన్‌ను ఎన్నికల కమిషన్ అన్‌ఫ్రీజ్ చేసిందని చెప్పారు. రాజకీయ పార్టీలు అందించిన ఫిర్యాదులు, ఇతర క్లెయిమ్‌లపై సకాలంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రం వారీగా ప్రతి ఫారం–7 క్లెయిమ్‌ను ప్రొసీజర్ ప్రకారం పరిశీలించిన తరువాతే తొలగించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో అన్ని విషయాలనూ స్పష్టంగా వివరించాలని చెప్పారు. ఫిర్యాదులు, ఇతర క్లెయిమ్‌ల పరిశీలనకు ఇంటింటికీ వెళ్లినప్పుడు బీఎల్‌ఓలు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ఏ చిన్నపొరపాటుకు, విమర్శలకు తావివ్వకుండా ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణీ సుస్మిత, సి.శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు వరప్రసాద్, సుధారాణి, వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు విశ్వనాథ్, బాలాజీ, తహసీల్దార్లు బాలకిషన్, మారుతి, శ్రీధరమూర్తి, వాణిశ్రీ, హరికుమార్, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శంకర్

గుమ్మఘట్ట: గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు డీఎల్‌డీఓ శంకర్ సూచించారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం జగనన్న కాలనీలో చేపట్టిన గృహ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలు చేపట్టిన తర్వాత వాటి స్థాయిలను అధికారులు పర్యవేక్షించి సకాలంలో బిల్లులు చెల్లిస్తారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బిల్లులు పెండింగ్‌లో పెట్టబోమన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహ మూర్తి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏడీఏ లక్ష్మా నాయక్, సర్పంచ్ అనిల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత, హౌసింగ్ ఏఈ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

### భానుప్రకాష్ నాయక్ సస్పెన్షన్


భానుప్రకాష్ నాయక్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని సెంట్రల్ స్కూల్‌లో లైబ్రరీయన్‌గా పనిచేస్తున్న భానుప్రకాష్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. స్కూల్ విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలపై మూడు నెలల క్రితం విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సెంట్రల్ స్కూల్స్ డిప్యూటీ కమిషనర్ చేపట్టిన విచారణలో వాస్తవాలు నిగ్గు తేలడంతో భానుప్రకాష్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# మాయగాళ్ల వలలో పడొద్దు

- సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్


మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: సాంకేతికత అభివృద్ధి చెందిన ప్రస్తుత రోజుల్లో ఆర్థిక నేరాలూ అదే స్థాయిలో జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా సైబర్ నేరగాళ్ల వలలో పడకూడదని ప్రజలను హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరాలపై జిల్లా వాసుల్లో అవగాహన పెంచేందుకు పోలీసు శాఖ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎస్పీ అన్బురాజన్ మంగళవారం పలు సూచనలు చేశారు. అవి ఆయన మాటల్లోనే...

**ఫేక్ అకౌంట్లతో బురిడి**

సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు, హోదా ఉన్న వ్యక్తుల ప్రొఫైల్‌తో ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం వంటి సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని ఆర్థిక నేరాలకు పాల్పడే వారి సంఖ్య పెరిగింది. ముందుగా సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు సృష్టించి, ఆ తర్వాత ఒరిజినల్ ఖాతాతో సంబంధాలున్న వారికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతారు. అవతలి వారు రిక్వెస్టును యాక్సెప్ట్ చేశాక వారితో తాను ఒరిజినల్ ఖాతాదారుడిననే నమ్మిస్తారు. ఆ తర్వాత తనకు ఇబ్బందులున్నాయని, ప్రస్తుతం ఆదుకుంటే తన ఇబ్బందులు తీరాక ఆ డబ్బు తిరిగి అందజేస్తానంటూ అభ్యర్థిస్తారు. ఇదంతా నమ్మి సదరు వ్యక్తి తెలిపిన నంబర్‌కు నగదు బదిలీ చేసిన కొంత కాలం తర్వాత చెల్లింపు విషయంగా ఒరిజనల్ వ్యక్తిని అడిగినప్పుడు అసలు విషయం వెలుగులోకి వస్తుంది. తాను మోసపోయినట్లు తెలుసుకుని, ఏమీ చేయలేని అసహాయ స్థితిలో ఉండాల్సి వస్తుంది. ఇలా జరగకుండా ఉండాలంటే అపరిచిత వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులను యాక్సెప్ట్ చేయకుండా ఉండడం మంచిది. ఫ్రెండ్ రిక్వెస్టులను ఒకటికి రెండు సార్లు ధ్రువీకరించుకున్న తర్వాతే యాక్సెప్ట్ చేయాలి.

**లోన్ యాప్స్‌తో పెను ప్రమాదం**

సులువుగా అప్పు లభిస్తుందని లోన్ యాప్స్‌ని నమ్మితే పెను ప్రమాదానికి దారి తీస్తుంది. చిన్న మొత్తంలో అప్పు ఇచ్చి ఆ తర్వాత ఎక్కువ మొత్తంలో డబ్బు కట్టించుకునేంత వరకూ వదలరు. అవసరమైతే బ్లాక్‌మెయిల్‌కు సైతం దిగుతారు. మానసిక క్షోభకు గురిచేస్తారు. అనధికార లోన్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసేటప్పుడు కాంటాక్ట్, మీడియా, గ్యాలరీలకు సంబంధించి ఎలాంటి పర్మిషన్లు ఇవ్వకూడదు.

**ఉద్యోగాల కల్పన పేరుతో**

ఉద్యోగాల కల్పన పేరుతో మోసం చేసే వారి సంఖ్యా పెరిగింది. మొబైల్‌కి మెసేజ్ లేదా టెలిగ్రాం, వాట్సాప్ లింక్ పంపిస్తారు. దానిని క్లిక్ చేయగానే మీరు పార్ట్‌టైమ్ జాబ్‌కు అర్హులంటూ మరో మెసేజ్ వచ్చేస్తుంది. ఓ మోసపూరిత వెబ్‌సైట్ పేరు సూచించి అందులో రిజిస్టర్ కావాలని చెబుతారు. ఇదంతా నిజమని నమ్మి వివరాలు పొందుపరచగానే ఓ ప్రొడక్ట్‌కు పెట్టుబడి పెట్టి ప్రమోట్ చేయాలని సూచిస్తారు. పెట్టుబడి వెనక్కు రావడంతో పాటు ఆకర్షణీయమైన కమీషనూ చేతికి అందుతుందంటారు. యూపీఐ ఐడీలను పంపి పెద్ద మొత్తంలో నగదును బదిలీ చేయించుకుంటారు. వారు చెప్పిన టాస్కులన్నీ పూర్తి చేసినా డబ్బు పంపకుండా మోసం చేస్తారు. ఫోన్ చేస్తే ఎలాంటి స్పందన ఉండదు. ప్రధానంగా ఇలాంటి అంశాల్లో నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలి.

**బీమా పేరుతో కొన్ని...**

అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీకు ఇన్సూరెన్స్ మెచ్యూరిటీ డబ్బు వస్తుందని చెబితే నమ్మకండి. మీ బ్యాంక్ ఖాతా, పాన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు, ఓటీపీ నంబర్లు ఎలాంటి పరిస్థితుల్లోనూ షేర్ చేయకండి. మీకు ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో పాలసీ ఉందని, మెచ్యూరిటీ తీరడంతో రూ.లక్షల్లో డబ్బు చేతికి అందుతుందని నమ్మిస్తారు. వాటిని క్లెయిమ్ చేసుకోవాలంటే ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ తదితర చార్జీలు చెల్లించాలని ఇందుకు కొంత డబ్బు తమ ఖాతాకు బదిలీ చేస్తే మొత్తం ప్రక్రియ పూర్తి చేసి మీ బ్యాంక్ ఖాతాకు నగదు జమ చేస్తామని నమ్మిస్తారు. అసలు మీకు బీమా పాలసీ లేదని చెప్పినా.. వినకుండా నమ్మించేస్తారు. విడతలవారీగా డబ్బు బదిలీ చేయించుకుని ఆ తర్వాత ఫోన్ స్విచ్చాఫ్ చేసేస్తారు. గ్రామీణులే కాకుండా ఉన్నత విద్యావంతులు సైతం ఇలాంటి మాయగాళ్ల వలలో చిక్కుకుంటున్నారు. అప్రమత్తంగా ఉండాలి. అలాగే బహుమతులు గెలిచారని కూడా మోసాలకు పాల్పడుతుంటారు. అపరిచిత అమ్మాయిల పేరుతో, ఫొటోలతో సోషల్ మీడియాలో ఉన్న ఖాతాలను ఎలాంటి పరిస్థితుల్లోనూ నమ్మబోకండి. వీరితో చాలా అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే హనీట్రాప్ ఉచ్చులోచిక్కుకునే ప్రమాదముంది. ఒకవేళ సైబర్ నేరగాళ్ల బారిన పడినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయండి. విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తాం.

### కేసుల దర్యాప్తు ముమ్మరం చేయండి : ఎస్పీ

అనంతపురం క్రైం: పెండింగ్ కేసుల దర్యాప్తును ముమ్మరం చేయాలని డీఎస్పీలకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ అంశంపై బుధవారం తన చాంబర్‌లో డీఎస్పీలతో ఆయన సమీక్షించారు. చీటింగ్ కేసుల పెండెన్సీ తగ్గించాలన్నారు. దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ నమోదు చేయాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా పెంచాలన్నారు. ఆయా కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వాహన చోదకుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. దొంగతనాల కేసులను ప్రాధాన్యతగా తీసుకుని వాటిని ఛేదించడంతో పాటు రికవరీల శాతం పెంచాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు సీఎం గంగయ్య, నర్సింగప్ప, ప్రసాద రెడ్డి, బీవీ శివారెడ్డి పాల్గొన్నారు

### చెలరేగిన వడ్డీ వ్యాపారులు

పెద్దపప్పూరు: మండలంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు చెలరేగారు. మామ చేసిన అప్పు తీర్చలేదంటూ కోడలిపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడు గ్రామానికి చెందిన వెట్టి నాగప్ప కొన్నేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఓబులేసు, కర్రెప్ప, శ్రీదేవితో అప్పు చేశాడు. ఆ మొత్తాన్ని చెల్లించాలంటూ నాగప్ప కోడలు మహాలక్ష్మిని కొంత కాలంగా వడ్డీ వ్యాపారులు ఒత్తిడి చేస్తూ వచ్చారు. అయితే 30 ఏళ్ల క్రితమే తన మామ ఊరొదిలి వెళ్లాడని, ఆయన చేసిన అప్పులకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఆమె చెప్పినా వినకుండా ఈ నెల 5న సాయంత్రం ఇంట్లోకి చొరబడి మహాలక్ష్మిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు అనంతపురంలోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయి వచ్చిన ఆమె బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు.

### అవినీతి రహిత సమాజ నిర్మాణం సాగాలి

అనంతపురం కల్చరల్: అవినీతి రహిత సమాజం నిర్మాణంలో భాగస్వాములు కావాలని యువతకు విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఎస్‌వైకే, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మునిరామయ్యతో పాటు యువ కేంద్ర డీడీఓ శ్రీనివాసులు మాట్లాడారు. అవినీతిని అడ్డుకునేందుకు విజిలెన్స్ శాఖ ఉందని, ఈ క్రమంలో సమాజంలోని అవినీతి, అక్రమాలను ఎప్పటికప్పుడు విజిలెన్స్ దృష్టికి తీసుకురావాలని యువతకు సూచించారు. 14400 టోల్ ఫ్రీ నంబర్‌పై ప్రజలను చైతన్య పరుస్తూ అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. అనంతరం అవినీతి నిర్మూలనపై నిర్వహించిన వక్తృత్వం, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనపరచిన వారికి ప్రశంసాపత్రాలు, పతకాలు, ప్రోత్సాహక బహుమతులందించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుంకర రమేష్, కాపు సేన అధ్యక్షుడు పేరూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

### హత్య కేసు నమోదు

గార్లదిన్నె: తాము చూసిన సంబంధం కాకుండా ప్రేమించిన యువకుడిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధమైన కుమార్తెను హత్య చేసిన కుటుంబసభ్యులపై హత్య కేసు నమోదైంది. ఈ మేరకు గార్లదిన్నె ఏఎస్ఐ గురుమూర్తి బుధవారం వెల్లడించారు. కోటంకకు చెందిన అంజినమ్మ కుమార్తె కోమల ఆదే గ్రామానికి చెందిన మరో కులానికి చెందిన యువకుడిని ప్రేమించింది. విషయం తెలుసుకున్న తల్లి మరో సంబంధం చూసింది. తనకు ఇష్టం లేదని కోమల తేల్చి చెప్పడంతో ఘర్షణ పడిన తల్లి అంజినమ్మ, అన్న కేదారనాథ్ ఆమెను మంగళవారం రాత్రి చితకబాది, చున్నీతో గొంతు బిగించి హతమార్చారు. ఈ కేసులో బంధువుల ఫిర్యాదు మేరకు అంజినమ్మ, ఆమె కుమారుడు కేదారనాథ్‌పై హత్య కేసు నమోదు చేశారు.

# మహిళాసంఘాల డబ్బు స్వాహా

గార్లదిన్నె: మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బును బుక్ కీపర్ బ్యాంక్‌లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్న అంశంపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. గార్లదిన్నె మండలంపెనకచెర్ల గ్రామానికి చెందిన బిస్మిల్లా దస్తగిరి, నిర్మల పేరుతో రెండు మహిళా సంఘాలకు బుక్‌కీపర్‌గా అనిత వ్యవహరిస్తోంది. ఒక్కో సంఘంలో పది మంది చొప్పున సభ్యులు ఉన్నారు. స్థానికగా ఉండే కెనరా బ్యాంకులో ఆయా గ్రూపులకు ఖాతాలున్నాయి. ఈ నేపథ్యంలో పది నెలల క్రితం బిస్మిల్లా దస్తగిరి సంఘానికి రూ.10 లక్షలు, రెండేళ్ల క్రితం నిర్మలా సంఘానికి రూ.12 లక్షలు రుణం మంజూరైంది. తీసుకున్న రుణానికి సంబంధించి బిస్మిల్లా దస్తగిరి సభ్యులు ప్రతి నెలా రూ.30 వేలతో పాటు రూ.2వేలు పొదుపు, నిర్మలా సంఘం సభ్యులు రుణం కంతు రూ.30 వేలతో పాటు రూ.వెయ్యి పొదుపును బుక్ కీపర్ ద్వారా బ్యాంక్‌కు చెల్లించేవారు. ఈ క్రమంలో బిస్మిల్లా దస్తగిరి సంఘానికి సంబంధించి ఐదు నెలలు (రూ.1.65 లక్షలు), నిర్మల సంఘానికి సంబంధించి ఏడు నెలల కంతులు (రూ.2.23 లక్షలు) బ్యాంక్‌లో జమ కాలేదు. మొత్తం రూ.3.88 లక్షల లావాదేవీలకు సంబంధించి ఆయా సంఘాల పాసు పుస్తకాల్లో బుక్ కీపర్ నమోదు చేసినా... బ్యాంక్ ఖాతాలో మాత్రం నగదు జమ కాలేదు. దీంతో అనుమానం వచ్చిన సభ్యులు బుక్ కీపర్‌ను నిలదీశారు. బ్యాంక్‌లో డబ్బు కట్టినట్లుగా తమకు రసీదు చూపాలని పట్టుబట్టారు. దీంతో తాను బ్యాంక్ ఖాతాలో డబ్బు జమ చేయలేదని, త్వరలో ఈ డబ్బు చెల్లిస్తానని తెలిపిన అనిత.. ఆ తర్వాత ముఖం చాటేస్తూ వచ్చింది. దీంతో తాము మోసపోయినట్లుగా గుర్తించిన సంఘం సభ్యులు బుధవారం గార్లదిన్నె పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై వెలుగు ఏపీఎం శ్రీరాములు మాట్లాడుతూ.. మహిళా సంఘాల బ్యాంక్ ఖాతాల్లో డబ్బు జమ చేయకుండా స్వాహా చేసిన వైనం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

# వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

**జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. వెన్ను నొప్పి తాళలేక ఓ భవన నిర్మాణ కార్మికుడితో పాటు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ జీవితంపై విరక్తితో ఓ వివాహిత, అప్పులు తీర్చే మార్గం కానరాక మరో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు...**


దాదాఖలందర్


జ్యోతి


రహంతుల్లా (ఫైల్)

పామిడి: స్థానిక నాగిరెడ్డి కాలనీకి చెందిన గఫూర్‌ఖాన్, నసీరాబీ దంపతుల పెంపుడు కుమారుడు దాదాఖలందర్ (25) బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా వెన్నుముక నొప్పితో బాధపడుతున్న దాదా ఖలందర్‌కు కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాలేదు. ఈ క్రమంలోనే బుధవారం నొప్పి తీవ్రత తాళలేక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరు గ్రామ అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి (40) ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన నాగరాజుతో 20 ఏళ్ల క్రితం జ్యోతికి వివాహమైంది. అప్పటి నుంచి వీరికి సంతానం లేదు. ఏడు నెలల క్రితం ఓ పాపకు జన్మనిచ్చింది. కాన్పు తర్వాత అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె బుధవారం ఉదయం విధులకు హాజరైంది. మధ్యాహ్నం 11.30 గంటలకు చికిత్స కోసం కణేకల్లులోని ప్రభుత్వాస్పత్రికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యంలో నాగేపల్లి శివారులో హెచ్చెల్సీ వద్దకు చేరుకోగానే ఫోన్ ఇంట్లో మరిచిపోయి వచ్చానని, వెనక్కు వెళ్లి తెచ్చుకుంటానని ఆటో డ్రైవర్‌తో చెప్పి వాహనం దిగింది. అప్పటికే జ్యోతి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో విషయాన్ని తోటి ప్రయాణికులు ఆమె భర్తకు ఫోన్ చేసి తెలిపారు. వెంటనే కుటుంబసభ్యులు హెచ్చెల్సీ ప్రాంతానికి చేరుకుని జ్యోతి కోసం గాలింపు చేపట్టారు. కాలువలోని నీటిలో తేలుతున్న జ్యోతి మృతదేహాన్ని గుర్తించి వెలికి తీసి, బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, జ్యోతి మృతి విషయం తెలుసుకున్న సీడీపీఓ యల్లమ్మ, సూపర్‌వైజర్ రమాదేవి, గీత, శాంతకుమార్, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సర్పంచ్ ఫణీంద్రగౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందరితో కలుపుగోలుగా ఉండే జ్యోతి ఆత్మహత్య చేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

తాడిపత్రి అర్బన్: స్థానిక పడమటి వీధికి చెందిన అచ్చుకట్ల రహంతుల్లా (32) వెల్డర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం అనంతపురానికి చెందిన రుక్సానాను పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబ జీవనం, ఇతర అవసరాలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు చేశాడు. సకాలంలో అప్పులు తీర్చలేకపోవడంతో ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. రెండు రోజుల క్రితం పుట్టింట జరిగిన గ్యార్మీ వేడుకల్లో పాల్గొనేందుకు పిల్లలతో కలసి రుక్సానా వెళ్లింది. ఆ సమయంలో వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక రహంతుల్లా ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఈ విషయం బయటికి పొక్కలేదు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో ఇరుగు పొరుగు వారి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి 11గంటలకు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తలుపులు తీసి లోపలకు ప్రవేశించి ఉరికి వేలాడుతున్న రహంతుల్లా మృతదేహాన్ని కిందకు దించి, ఆస్పత్రికి తరలించారు. రుక్సానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



### జిల్లాలో మోస్తరు వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ మోస్తరు వర్షం కురిసింది. గుమ్మఘట్ట, గుత్తి, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, పామిడిలో 30 - 40 మి.మీ, పెద్దవడుగూరు, ఉరవకొండ, కణేకల్లు, పుట్లూరు, గుంతకల్లులో 20-30 మి.మీ, అనంతపురం, రాప్తాడు, బెళుగుప్ప, కంబదూరు, విడపనకల్లు 10-20 మి.మీ మేర వర్షపాతం నమోదైంది.

### పోలీసు సిబ్బందికి 'గ్రీవెన్స్'

అనంతపురం క్రైం: జిల్లాలోని ఏఆర్ పోలీస్ సిబ్బంది, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి ఎస్పీ బుధవారం 'గ్రీవెన్స్' నిర్వహించారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ నిర్వహించిన కార్యక్రమంలో కిందిస్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. కొన్ని సమస్యలకు ఎస్పీ అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మిగతా వాటికి చట్ట పరిధిలో పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు.

### చికిత్స పొందుతూ బాలుడి మృతి

పెద్దవడుగూరు: ప్రమాదవశాత్తు ఐరన్ గుళికలు మింగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాలుడు పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాలు.... పెద్దవడుగూరు మండలం చిట్టూరుకు చెందిన కుమ్మర రామాంజనేయులు కుమారుడు అభిరామ్ కృష్ణ (5) రెండు రోజుల క్రితం ఇంట్లో ఉన్న ఐరన్ మాత్రలు మింగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న బాలుడిని గుర్తించిన కుటుంబసభ్యులు ఆగమేఘాలపై అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక బుధవారం ఉదయం బాలుడు మృతి చెందాడు.

# బెదిరింపులకు తుపాకీ!



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీని పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్, నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

- అప్పులు ఎగ్గొట్టే పథకంలో భాగం
- తర్వాత బలవంతపు వసూళ్లకు స్కెచ్
- రూ.25 వేలకు కొనుగోలు చేసిన ఇద్దరి అరెస్ట్
- విలేజ్ విజిట్‌లో వెలుగు చూసిన కొత్త కోణం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: జల్సాల కోసం అప్పులు చేశారు. వాటిని తీర్చే లేక నాటు తుపాకీ చూపి బెదిరింపులకు పాల్పడుతూ అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఈ క్రమంలో తమకు అప్పిచ్చిన వ్యక్తినే హతమార్చేందుకు స్కెచ్ వేశారు. చివరకు పోలీసులకు పట్టుబడి ఊచలు లెక్కిస్తున్నారు. వివరాలను బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు.

**రూ.లక్షల్లో అప్పు :** ఇటుకలపల్లి సమీపంలోని ఉప్పరపల్లికి చెందిన ట్రాక్టరు డ్రైవర్ నడిమిదొడ్డి పెన్నోబులేసు, కర్ణాటకలోని బళ్లారి జిల్లా కంప్లికి చెందిన కన్నయ్య ఇద్దరూ స్నేహితులు. ప్రస్తుతం వీరు రాప్తాడు పంచాయతీ పరిధిలోని మైనారిటీ కాలనీలో నివాసముంటున్నారు. మద్యం, ఇతర చెడు వ్యసనాలకు బానిసైన వీరు తమ స్థాయికి మించి అప్పులు చేశారు. కేవలం పెన్నోబులేసుకే దాదాపు రూ.30 లక్షల వరకూ అప్పులున్నాయి. ఈ క్రమంలోనే తన డబ్బు రూ.1.50 లక్షలు చెల్లించాలంటూ వరుసకు మామ అయిన రాంభూపాల్ తరచూ నిలదీస్తుండడంతో పెన్నోబులేసు జీర్ణించుకోలేకపోయాడు. దీంతో అప్పులు తీర్చేందుకు కన్నయ్యతో కలసి నాలుగు నెలలుగా కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తెప్పించుకుని ఉప్పరపల్లి, చుట్టుపక్కల గ్రామాల్లో అధిక ధరకు అమ్మి సొమ్ము చేసుకోవడం మొదలు పెట్టాడు. అయినా అప్పులు తీరలేదు.

**తమ జోలికి ఎవరూ రాకూడదని :** ఎలాగైనా తక్కువ వ్యవధిలో పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనుకున్న పెన్నోబులేసు, కన్నయ్య... చివరకు తమ వద్ద తుపాకీ ఉంటే తమ జోలికి ఎవరూ రారని భావించారు. పైగా ఆ తుపాకీతో వడ్డీ వ్యాపారులను బెదిరించి అప్పులు ఎగ్గొట్టడమే కాక, ధనవంతులను బెదిరించి డబ్బు వసూలు చేయవచ్చునని ప్లాన్ వేశారు. అనుకున్నదే తడవుగా తమకు తెలిసిన ఓ వ్యక్తిని సంప్రదించి, అతనికి తెలిసిన వారి వద్ద ఉన్న నాటు తుపాకీని రూ.25 వేలు చెల్లించి కొనుగోలు చేసి, ఉప్పరపల్లి - పసలూరు మధ్యలోని శివ ఇటుకల బట్టీ వద్ద ఉన్న గుడిసెలో దాచారు. అనంతరం రాంభూపాల్‌ను హతమార్చాలని పథకం వేశారు.

**పట్టుబడ్డారు ఇలా.. :** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలతో అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ జాకీర్ హుస్సేన్, ఇటుకలపల్లి ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి విలేజ్ విజిట్ చేపట్టారు. ఈ క్రమంలో గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ చేపట్టినప్పుడు ఇటుకల బట్టీ వద్ద ఉన్న గుడిసెలో దాచిన తుపాకీతో పాటు 60 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. అనుమానాస్పదంగా కనిపించిన పెన్నోబులేసు, కన్నయ్యను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో తుపాకీ కొనుగోలు, తర్వాత పరిణామాలు ఒక్కొక్కటిగా వెలుగు చూశాయి. కర్ణాటక మద్యంతో పాటు, తుపాకీని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. తుపాకీ కొనుగోలుకు సహకరించిన వ్యక్తి అజ్ఞాతంలో ఉన్నాడని, త్వరలో అతణ్ని కూడా అరెస్ట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి పైపులు ధ్వంసం చేసిన పచ్చ నేతలు


వడ్లపాలెంలో పర్యటిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: స్థానిక వడ్లపాలెంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో ఏర్పాటు చేసిన పైపులను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. వివరాలు.. కాలనీలో నెలకొన్న నీటి ఎద్దడిని గతంలో కాలనీ వాసులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన కాలనీలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా నీటి ట్యాంకులను ఏర్పాటు చేయించి పైపులైన్ ద్వారా పలు వీధుల్లో కొళాయిలు అమర్చేలా చొరవ తీసుకున్నారు. దీంతో కాలనీ వాసులు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. ఈ విషయం గిట్టని చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో ఆ వార్డు టీడీపీ కౌన్సిలర్ బుధవారం పైపులను, కొళాయిలను ధ్వంసం చేయించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధనరెడ్డి ఆ కాలనీని సందర్శించి తాత్కాలికంగా పైప్‌లైన్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు.

# విశ్వాసంతోనే ఉత్తమ జీవితం



ప్రార్థన చేయిస్తున్న రెవరెండ్ జాన్‌వెస్లీ, జడివానలోనూ దేవుడి వాక్యం వింటున్న భక్తులు

- అంతర్జాతీయ సువార్త ప్రసంగీకులు రెవరెండ్ జాన్‌వెస్లీ

అనంతపురం కల్చరల్: దేవుడి పట్ల మనం చూపే విశ్వాసమే ఉన్నతులను చేస్తుందని అంతర్జాతీయ సువార్తికులు రెవరెండ్ జాన్‌వెస్లీ అన్నారు. అనంతపురంలోని న్యూటౌన్ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సువార్త స్వస్థత సభ రెండో రోజు బుధవారమూ కొనసాగింది. క్వయర్ బృందాలు ఆలపించిన క్రైస్తవ భక్తిగీతాలతో ఆ ప్రాంతం మార్మోగింది. రెవరెండ్ జాన్ వెస్లీ, సిస్టర్ బ్లెస్సీవెస్లీ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు కరుణామయ జీవితాన్ని వివరించారు. శాంతిని చాటే క్రైస్తవ్యం ప్రపంచ ప్రజలందరిదన్నారు. మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి, వైఎస్ థామస్‌రెడ్డి, సీఎస్ఐ సంఘకాపరి బెన్‌హర్‌బాబు, రెడ్డివారి నెహమ్యా నాగరాజు, రెవరెండ్ మోజెస్ అనిల్ కుమార్, ఈటె స్వామిదాసు, డేనియల్ తదితరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటల నుంచి తాడిపత్రిలోని సెయింట్ జాన్స్ సీఎస్ఐ టౌన్ చర్చిలో వెస్లీ దైవ పరిచర్య చేస్తారని, అందరూ విచ్చేయాలని ఆత్మీయ పిలుపునిచ్చారు.

## క్లుప్తంగా

### సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రాంభూపాల్

**ఆత్మకూరు:** గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. బుధవారం ఆత్మకూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఆత్మకూరులో ఉన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో రెండు అడుగుల లోతు నీరు నిలిచాయన్నారు. విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు రంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్ర కుమార్, రంగారెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాదుస్తుల వితరణ



క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం

**చెన్నేకొత్తపల్లి:** మండలంలోని న్యామద్దల ఉన్నత పాఠశాలలో వివిధ క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన విజయభాస్కర్, చెన్నారెడ్డిలు బుధవారం క్రీడా దుస్తులు వితరణ చేశారు. 32 మందికి రూ. 20 వేల విలువ చేసే దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద్ నాయక్, పీఈటీ కుమార రాజు, ఉపాధ్యాయులు రాజశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు పరిహారం ఇవ్వాలి

**రాప్తాడు:** తీవ్ర వర్షాభావంతో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందజేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం రాప్తాడులో గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేసి డిజిటల్ అసిస్టెంట్ హరికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎకరాకు రూ.50 వేలు, పంటలు సాగు చేయని రైతులకు రూ.15 వేలు పరిహారం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర, రైతు సంఘం నాయకులు చలపతి, రసూల్, నారాయణస్వామి, శీనప్ప, శాంతి, మంజుల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్‌యార్డులో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, వ్యాపారులు

**అనంతపురం అగ్రికల్చర్:** గ్యార్మీని పురస్కరించుకుని బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫ్రూట్ మండీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ పాల్గొని రైతులు, కూలీలు, వ్యాపారులు, యార్డు సిబ్బందికి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాధుశేఖర్, రవికుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, కోశాధికారి కృష్ణ, విజయ్, వెంకటేష్, సంజీవరాయుడు, యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

### బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

**అనంతపురం అర్బన్:** ఏపీకి అన్ని విధాలా అన్యాయం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా రక్షణ భేరిలో భాగంగా బుధవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, శ్రీ కంఠం సర్కిల్ తదితర ప్రాంతాల్లో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. సీపీఎం నగర కార్యదర్శులు రామిరెడ్డి, వెంకటనారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయకపోగా, కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర సంపదను దోచి పెడుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 15న విజయవాడలో నిర్వహించనున్న బహిరంగసభకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శీనా, నాగరాజు, శివ, బంగారు నాగరాజు, మురళి, భవాని శీన, ప్రసాద్, నిజాం, బాషా, శ్రీను, బాషా, ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుల దివ్వెలు..

నగరంలో దీపావళి సందడి మొదలైంది. పండుగ రోజున ఇల్లు, పరిసరాలు దీపాల వెలుగులో కాంతులీనుతాయి. ఇందు కోసం రకరకాల ప్రమిదలు మార్కెట్లోకి వచ్చాయి. వివిధ ఆకృతుల్లో తయారైన దివ్వెలను కొనుగోలు చేయడానికి నగరవాసులు ఆసక్తి కనబరుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు





వివిధ ఆకృతుల్లో రూపుదిద్దుకున్న దివ్వెలు



ఆకర్షిస్తున్న దీపాలు

# కనకదాస విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ

**ఆత్మకూరు:** మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మలు కనకదాస విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ నిర్వహించారు. స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద టెంకాయలు కొట్టి గడ్డ పారతో తవ్వి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుబలు ఐకమత్యంగా ముందుకు సాగాలని కోరారు. మండల వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా అందజేయాలని ఎమ్మెల్యే తహసీల్దార్ షర్మిలకు సూచించారు. ఎవరైనా భూమి అమ్మేలా ఉంటే ఇంటి స్థలాల కోసం రైతులతో మాట్లాడితే కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి రైతులకు ఎంతో మేలు చేశారన్నారు. ఉచితంగా విద్యుత్ ఇచ్చి ఆదుకున్నారని తెలిపారు. అదే తరహాలో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చారన్నారు. రైతు భరోసా నగదు ఖాతాలకు జమయిన సందర్భంగా రైతులు, నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో మందులు, విత్తనాలు, ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్జి కురుబ కిష్టప్ప, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పార్వతమ్మ, ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు వెంకట్రాముడు, మల్లన్న, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు తుప్పటి ఈశ్వరయ్య, బిల్లే ముత్యాలన్న, కురుబ సంఘ నాయకులు మారెన్న, పోలన్న, సుబ్బర రామాంజినప్ప, బిల్లే శివయ్య, పిల్లల ఈశ్వరయ్య, రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నారెడ్డి,వెంకటేష్, శ్రీరామ్, మురళి, నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

### కాలిపోయిన కంప్యూటర్లు

**కనగానపల్లి:** కనగానపల్లిలో విద్యుత్ సరఫరాలో సంభవించిన హైఓల్టేజీ సమస్యతో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో కంప్యూటర్లు కాలిపోయాయి. బుధవారం ఉదయం కరెంట్ సరఫరాలో తలెత్తిన హెచ్చుతగ్గుల సమస్య వల్ల కార్యాలయంలోని మూడు కంప్యూటర్లలో షార్ట్ సర్క్యూట్ జరిగి కాలిపోయినట్లు డీటీ ప్రసాద్ తెలిపారు. యూపీఎస్ సౌకర్యం కూడా సరిగా లేకపోవటంతో పనులన్ని ఆగిపోయినట్లు సిబ్బంది తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కూడా రెండు రోజుల క్రితం హైఓల్టేజీ సమస్య వల్ల రెండు కంప్యూటర్లు కాలిపోయినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

### పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం కల్చరల్:** వివిధ రంగాల్లోని సుప్రసిద్ధుల సేవలను గుర్తించి అవార్డులతో సత్కరిస్తున్న ఆల్ ది బెస్టు అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా అక్షర బ్రహ్మ, సేవా బ్రహ్మ జాతీయ స్థాయి పురస్కారాలను అందిస్తోంది. ఇందుకోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ నిర్వాహకుడు డాక్టర్ ఈఎస్‌ఎస్ నారాయణ మాస్టర్ కోరారు. విద్యారంగంలో కృషి చేస్తున్న వారికి అక్షర బ్రహ్మ, ఇతర రంగాలలో సేవలందిస్తున్నవారికి సేవా బ్రహ్మ అవార్డులను డిసెంబరు 11న హైదరాబాదు వేదికగా అందిస్తున్నట్లు వెల్లడించారు.

# నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** అనంతపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఒకటవ డివిజన్‌లోని ఎర్రనేలకొట్టాల, నారాయణపురం పంచాయతీలోని నాగిరెడ్డిపల్లిలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

**జయప్రదం చేద్దాం**

**రాప్తాడు:** మండల వ్యాప్తంగా గురువారం నుంచి ఈ నెల 21 వరకు చేపట్టనున్న 'ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ సాల్మన్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగనే మళ్లీ ఎందుకు కావాలి' అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలు ఏరకంగా సంక్షేమ పథకాలతో లబ్ధి పొందారో చూపించే బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 9న గొల్లపల్లి, 10న ఎం.చెర్లోపల్లి, 14న పాలచెర్ల, 15న ప్రసన్నాయపల్లి, 16న రాప్తాడు-1, 17న రాప్తాడు-2, 20న మరూరు, 21న చిన్మయనగర్‌లో కార్యక్రమాలుంటాయన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నరసింహారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు పలు ప్రాంతాల్లో 'సురక్ష' శిబిరాలు

**అనంతపురం కార్పొరేషన్:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాల, అంబేడ్కర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# మళ్లీ జగనే సీఎం కావాలి



బ్రోచర్లు విడుదల చేసిన మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి, కార్పొరేటర్లు

**అనంతపురం కార్పొరేషన్:** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాలని నగరపాలక సంస్థ మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగర పాలక సంస్థలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్యతో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ వర్గపోరుతో నగర అభివృద్ధిని విస్మరించారన్నారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి జరుగుతోందన్నారు. తమ ప్రభుత్వంలో ప్రధాన, అంతర్గత రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరానికి సీఎండీఎఫ్ నిధులు రూ.25 కోట్లు మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ విప్లవాన్ని సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చారన్నారు. నవరత్నాల ద్వారా ప్రజలు ఆర్థిక స్థితిగతులను మార్చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98.5 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు సీఎం కావాలంటే కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, ఇషాక్, శ్రీనివాసులు, బాబాఫకృద్దీన్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

# పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం చెన్నకేశవులు

**రాప్తాడు:** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడానికే జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయిని చెన్నకేశవులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సంబరాలు విద్యార్థుల్లో సైన్సు పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ 3 దశాబ్దాలుగా చెకుముకి సైన్సు సంబరాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 25 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. మండలంలో రాప్తాడు, గొందిరెడ్డిపల్లి, హంపాపురం, ఎం.బండమీదపల్లి, మరూరు జిల్లా పరిషత్ పాఠశాలలు, విన్సెంట్ డీపాల్, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులు 450 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు.

### ఏఎంసీలో ఉక్కపోత

- ఇంజినీర్లు, ఆర్‌ఎంఓల సమన్వయలోపం



అక్యూట్ మెడికల్ కేర్‌లో పని చేయని ఏసీల మధ్య రోగులు

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో ఏసీలు పనిచేయకపోవడంతో రోగులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఆస్పత్రిలోని వివిధ పరికరాల మరమ్మతు, పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం ఇటీవల రూ.3.5 కోట్లు కేటాయించిన విషయం విదితమే. కానీ ఆ నిధులతో ప్రాధాన్యతకనుగుణంగా చేపట్టాల్సి ఉండగా.. ఏపీఎంఎస్‌ఐడీసీ ఇంజినీర్లు, ప్రభుత్వ ఆస్పత్రి ఆర్‌ఎంఓల సమన్వయ లోపంతో రోగులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర విభాగాల్లో పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవడం విఫలమయ్యారు. ఏఎంసీలో మొత్తం తొమ్మిది ఏసీలు ఉన్నాయి. అందులో మూడు మాత్రమే పని చేస్తున్నాయి. అవి కూడా వైద్యుని గది, ఫార్మసీ, ప్యానల్‌బోర్డు గదిలో ఉన్నాయి. రోగులు ఉండే వార్డులో ఏసీలు పని చేయడం లేదు. అసలే ప్రాణాపాయ స్థితిలో ఉన్న కేసులను ఏఎంసీలో ఉంచి సేవలందిస్తారు. ఈ విషయమై ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ మహబూబ్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఏఎంసీలో ఐదు ఏసీలు పూర్తిగా పని చేయవని, ఒక్క ఏసీని రిపేరీ నిమిత్తం కాంట్రాక్టర్ తీసుకెళ్లారని, మరో రెండ్రోజుల్లో ఆ ఏసీ పని చేస్తుందో లేదో స్పష్టత వస్తుందని చెప్పారు.



రెండు వారాలుగా మూలన ఉంచిన ఏసీ

### జీవాల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, ఏడీలు, డాక్టర్లు

**అనంతపురం అగ్రికల్చర్:** సీజన్లకు అనుగుణంగా మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే జీవాల పెంపకం మరింత లాభదాయకంగా ఉంటుందని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో గొర్రెలు, మేకల సహకార సంఘాల సభ్యులకు జీవాల పెంపకంపై అవగాహన కల్పించారు. గొర్రెల విభాగం ఏడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేడీతో పాటు గొర్రెల యూనియన్ త్రీమెన్ కమిటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, పశువుల డాక్టర్లు గోల్డ్‌మెన్, శృతి, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరై గొర్రెలు, మేకల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు, నివారణ చర్యలు, సంతానోత్పత్తి పెంపు, మార్కెటింగ్, ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి అవగాహన కల్పించారు. అలాగే నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) కింద ప్రోత్సాహక రాయితీలు, ఎన్‌సీడీసీ రుణాలు, రికవరీల గురించి వివరించారు.

### నాగేశ్వరరావుకు ఎస్కేయూ డాక్టరేట్



నాగేశ్వరరావు

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని రూరల్‌డెవలప్‌మెంట్ విభాగంలో పరిశోధన చేసిన నాగేశ్వరరావుకు బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ సుధాకర్ పర్యవేక్షణలో 'సామాజిక అడవుల నిర్వహణ – అభివృద్ధి' అనే అంశంపై పరిశోధన చేశారు. ఫారెస్ట్ ఆఫీసర్ అయిన నాగేశ్వరరావు ఈ అంశంపై చేపట్టిన పరిశోధనకు పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ పొందిన సందర్భంగా రూరల్‌డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ మునినారాయణప్ప, సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ జీవీ రమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఫిరోజ్‌బాబు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందించారు.

### ఎస్కేయూ బంద్ విజయవంతం



తరగతులు బహిష్కరించి బయటకు వస్తున్న విద్యార్థులు

**అనంతపుం సిటీ:** కడపలో ఉక్కు పరిశ్రమ ప్రారంభించడంతో పాటు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ ఐసా రాష్ట్ర అధ్యక్షుడు వేమన, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ యనమల ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎంతో చరిత్ర కలిగిన వంద సంస్థలను ప్రైవేటీకరించే దిశగా ప్రధాని మోదీ శరవేగంగా అడుగులు వేయడంపై నిప్పులు చెరిగారు. ప్రైవేటీకరణను ఉపసంహరించుకోకపోతే మోదీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఐసా యూనివర్సిటీ కార్యదర్శి రాజు నాయక్, వంశీకృష్ణ, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధి వినోద్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు శివారెడ్డి, రవి, బందేశ్, మోహన్ పాల్గొన్నారు.



పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

# ఆపరేషన్ బ్యూటీ

## పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్ప నక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

### ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

### బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

### ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

### ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

### కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

### లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ-బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

### కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మెటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

### సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

దుర్గ ఇండియా




# ప్రతి స్త్రీ దుర్గ వలే...

**ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.**

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

### ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

### మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



### అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

టిప్

# డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి.
- నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది.
- వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి
- నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు
- నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర. నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు
- ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

# ఖుషీతో దిల్ ఖుష్



**చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.**

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

### తాతయ్య మరణంతో...



అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలాని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.



### పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

### మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలర్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

# మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి



● ఫౌజియా

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు.

ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో.

పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో' పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు.

ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.


డానీష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత దిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

**అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.**



మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.